ప్రజాశక్తి

గురువారం 25 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రక్షణ శాఖ మంత్రి అనకాపల్లి వస్తే..

ఉక్కు నేతలు అరెస్టులా ?

- ప్రభుత్వ, పోలీసు అత్యుత్సాహంపై పలువురు మండిపాటు
- కార్మిక నేతల నిర్బంధంపై నిరసనలు

దీక్షా శిబిరాన్ని చుట్టుముట్టిన పోలీసులు

గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఉక్కు నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఉక్కునగరం విలేకరి

అనకాపల్లిలో బుధవారం తలపెట్టిన ఎన్‌డిఎ కూటమి ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ రాగా పోలీసులు ఆయన భద్రత పేరిట అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలపై నిర్బంధం ప్రయోగించారు. రాజనాథ్‌సింగ్‌ను అడ్డుకునే అవకాశముందనే కారణంతో అరెస్టులు చేసి గాజువాక పోలీస్ స్టేషన్‌కు 11 మందిని తరలించారు. ఈ అక్రమ అరెస్టులపై విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ, పోలీసుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. అసలింతకీ ఏం జరిగిందంటే ఎప్పటిలాగే బుధ వారమూ కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు దీక్షల్లో మిగతా 2లో..

అక్రమ అరెస్టులు దారుణం : సిపిఎం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. రాజనాథ్‌సింగ్ అనకాపల్లి బిజెపి ఎన్నికల ప్రచారం కోసం కూర్మన్నపాలెం మీదుగా వెళ్తున్నారనే సాకుతో ఉక్కు పోరాట దీక్ష శిబిరంలో నిరసన దీక్ష చేస్తున్న నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి గాజువాక పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఖండించారు. కేంద్ర బిజెపితో రాష్ట్ర వైసిపి ప్రభుత్వం అంటకాగుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులపై నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. మూడేళ్ల కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉక్కు పోరాట కమిటీ నాయకులతో చర్చించి 24 గంటలు కాకముందే మిగతా 2లో..

ఎన్‌డిఎ ప్రభుత్వ గొప్పలకే పరిమితం

- స్టీల్‌ప్లాంట్ అంశాన్ని విస్మరించిన రాజనాథ్‌సింగ్
- ఎన్నికల లబ్ధి కోసం రామమందిర నిర్మాణ అంశం ప్రస్తావన
- ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలు దిశగానే అనకాపల్లిలో ఎన్నికల సభ

ప్రచార ర్యాలీలో అభివాదం చేస్తున్న రాజనాథ్‌సింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లిలో ఎన్‌డిఎ కూటమి బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీ, సభ సొంత గొప్పలకే పరిమితమైంది. ప్రజలకు ఆచరణలో ఏమీ చేయకపోయినా అన్నీ చేసినట్టుగా సభలో రాజనాథ్‌సింగ్ సహా పలువురు నేతలు చెప్పుకొచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వంపై వైసిపి ఉదారంగా వున్నా ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసిపి ప్రభుత్వంపై బిజెపి నాయకులు దాడి పెంచారు. అనకాపల్లిలో బుధవారం జరిగిన సభకు వచ్చిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైసిపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భూ దందా, ఇసుక, ఖనిజ, మత్తు మాఫియాకు పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఎన్నికల లబ్ధి కోసం రామమందిర నిర్మాణ అంశాన్ని ప్రస్తావించిన ఆయన పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం, గనులు కేటాయించడం వంటి అంశాలపై మాత్రం నోరుమెదపలేదు. ఎన్‌డిఎ ప్రభుత్వ గొప్పతనం చెప్పుకోవడం, వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్పితే వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సహాయంపై ఆయన చెప్పలేకపోయారు. పూర్తి మెజార్టీ ఇవ్వబట్టే 370 అధికరణం రద్దు చేశామని, రామందిర నిర్మాణం చేపట్టామని విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వస్తే బిజెపి మ్యానిఫెస్టోలో పేర్కొన్న వన్ నేషన్, వన్ ఎలక్షన్‌ను రాబోయే ఐదేళ్లలో అమలుచేస్తామని అన్నారు. అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ప్రధానిని పొగడ్డానికే తన సమయమంతా కేటాయించారు. సిఎం రమేష్ గెలిస్తే.. పోలవరం ప్రాజెక్టు, మిగతా 2లో..

ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులివ్వాలి

వార్త 8లో..

ఇండియా ఫోరం అభ్యర్థులనే గెలిపించండి

వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విద్యుత్ ఛార్జీల పెంపు తగదు

వార్త 8లో..

నామినేషన్ వేస్తున్న వేగి వెంకటేష్, చిత్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

కాంగ్రెస్ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి

వేగి వెంకటేష్ నామినేషన్

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా ఇండియా వేదిక బలపరిచిన వేగి వెంకటేష్ బుధవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ తుమ్మపాల గ్రామం నుంచి మొదలై గుండాల వీధి, రామచంద్ర థియేటర్, నెహ్రూ చౌక్, చిన్న మిగతా 2లో..

నామినేషన్ల వెల్లువ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బుధవరం నామినేషన్లు జోరందుకున్నాయి. విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి ఏడో రోజు బుధవారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ నుంచి మెట్ట రామారావు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి కొంగరాపు గణపతి, స్వతంత్ర అభ్యర్థులుగా కర్రి వేణుమాధవ్, గాదం అప్పల నరసింహ ఆనంద్, భారత చైతన్య యువజన పార్టీ నుంచి మురపాల అచ్యుత కిరణ్ బాలాజీ, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ నుంచి వాండ్రాసి నాగ సత్యనారాయణ, బ్లూ ఇండియా పార్టీ తరఫున మురాల అరుణశ్రీ, జై మహాభారత్ పార్టీ నుంచి గణపతి జగదీశ్వరరావు నామినేషన్లు వేశారు. సంబంధిత నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించారు. ఇదిలా ఉండగా బహుజన సమాజ్ వాదీ పార్టీ పెదపెంకి శివప్రసాద్, భారతీయ రాష్ట్రీయ దళ్ నుంచి గుంటు దుర్గాప్రసాద్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పొలమరశెట్టి సత్యవతి, సమాజ్‌వాదీ పార్టీ నుంచి జాలాది విజయ కుమారి, వైసిపి నుంచి బొత్స అనూష, బొత్స ఝాన్సీలక్ష్మి తరఫున కోలా గురువులు బుధవారం మరొకసారి రెండో సెట్ నామపత్రాలను సమర్పించారు. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 44 నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ పార్టీల నుంచి అభ్యర్థులు 63 సెట్ల పత్రాలను ఆయా రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అందజేశారు. తూర్పు నియోజకవర్గం నుంచి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఇ.హైమావతి ఒక సెట్, వైసిపి నుంచి ముల్లపూడి వీర వెంకట సత్యనారాయణ (ఎంవివి.సత్యనారాయణ) రెండు సెట్లు, వైసిపి నుంచి ముల్లపూడి నాగజ్యోతి రెండు సెట్లు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి డాక్టర్ గణపతి కొంగరపు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా బర్ల అప్పల పద్మాకర్ ఒక సెట్, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఇ.పీటర్ జోసెఫ్ ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి గుత్తుల శ్రీనివాసరావు ఒక సెట్, గుత్తుల మోనిక ఒక సెట్ సమర్పించారు. భీమిలి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నొక్కల సూర్యప్రకాశ్ ఒక సెట్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి ఎల్లిపిల్లి అనిల్ కుమార్ ఒక సెట్, ప్రజా ప్రస్థానం నుంచి దాసరి లక్ష్మీ సంధ్య ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఏలూరు ధర్మావతి ఒక సెట్, వైసిపి నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నాలుగు సెట్లు, వైసిపి నుంచి ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి రెండు సెట్లు, టిడిపి నుంచి గంటా శ్రీనివాసరావు ఒక సెట్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి చోడిపల్లి రాజు ఒక సెట్ సమర్పించారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలో వైసిపి నుంచి కమ్మిల కన్నపరాజు రెండు సెట్లు, వైసిపి నుంచి కమ్మిల సుమ, స్వతంత్ర మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు నేతలు అరెస్టులా ?

కూర్చున్నారు. 1168వ రోజు దీక్షలు కొనసాగుతుండగా మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసులు దీక్షా శిబిరాన్ని చుట్టుముట్టారు. పోరాట కమిటీ నాయకులు చెబుతున్నది ఏమాత్రం వినకుండా పోలీసు వాహనాలు ఎక్కించి గాజువాక స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ పోరాట కమిటీ నేతలు యు.రామస్వామి, మంత్రి రాజశేఖర్, రామకృష్ణ, శ్రీనివాసరాజు తదితరులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని చెబుతున్న రాజకీయ నేతల మాటలు బూటకమని అన్నారు.

అరెస్టులను ఖండిస్తూ నిరసనలు

పోరాట కమిటీ నేతల అరెస్టును ఖండిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద పోరాట కమిటీ, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. సిఐటియు నాయకులు వైటి.దాస్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా శాంతి యుతంగా దీక్షలు చేస్తున్న కార్మికులను అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల నేపథ్యంలో వచ్చే నాయకులను ప్రశ్నించకుండా ఉండేందుకు పోరాటాలను అణగదొక్కాలని చూడటం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయాలని చూస్తే కార్మికులు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులు దారుణం : సిపిఎం

అరెస్టులకు పాల్పడటం వైసిపి యొక్క బిజెపి లొంగుబాటు మరోసారి బహిర్గతమైందన్నారు. మరొకవైపు బిజెపితో ఏకంగా తెలుగుదేశం, జనసేన పార్టీలు జతకట్టి ఎన్నికల్లో పోటీచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ రాజకీయ ఒప్పందం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయోజనాలకు తీవ్ర ప్రమాదాన్ని తెస్తుందన్నారు. బిజెపికి వ్యతిరేకంగా పోరాడాల్సిన వైసిపి, తెలుగుదేశం, జనసేనలు బిజెపి జపం చేస్తూ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్నాయన్నారు. వారి రాజకీయ అవకాశవాద పొత్తులను ప్రజలు తిరస్కరించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులపై సాగిస్తున్న నిర్బంధకాండను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని చెబుతున్న బిజెపి ఇప్పుడు ఉక్కు నేతలను ఎందుకు అరెస్టు చేయించిందని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం చేసి ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి కాబట్టి ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతూ బిజెపి ప్రజలను మోసపుచ్చేందుకు చూస్తోందన్నారు. రాజకీయ సభలకు మంత్రి వెళ్లేటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం ఎన్నికల నిబంధన ఉల్లంఘనే అవుతుందని తెలిపారు.

నామినేషన్ల వెల్లువ

నామినేషన్ వేస్తున్న గణపతి

అభ్యర్థులుగా చింతల మల్లికార్జునరావు ఒక సెట్, వడ్డి శిరీష ఒక సెట్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి కందుల బాలాజీ ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. దక్షిణం నుంచి జనసేన పార్టీ నుంచి చెన్నుబోయిన శ్రీనివాసరావు (సిహెచ్.వంశీకృష్ణ) రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా చెన్నుబోయిన పద్మజ ఒక సెట్, వైసిపి నుంచి వాసుపల్లి ఉషారాణి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా బి.రోహిత్ కుమార్ జైన్ ఒక సెట్, బహుజన సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము రెండు సెట్లు, భారతీయ రాష్ట్రీయ దళ్ నుంచి గుంటు దుర్గాప్రసాద్ ఒక సెట్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి బురు శ్రీనివాసరావు ఒక సెట్ పత్రాలు సమర్పించారు. పెందుర్తి నుంచి బహుజన సమాజ్ పార్టీ నుంచి బంగారి రమణ, స్వతంత్ర అభ్యర్థిగా వడ్డాది ఉదయ్ కుమార్ ఒక సెట్, జనసేన పార్టీ నుంచి పంచకర్ల రమేష్ బాబు మూడు సెట్లు, పంచకర్ల వెంకటేశ్వరరావు ఒక సెట్, పంచకర్ల మహాలక్ష్మి ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. గాజువాక నుంచి స్వతంత్ర అభ్యర్థినిగా గవర రోహిణి కుమారి ఒక సెట్, లోక్ తాంత్రిక్ జనతా పార్టీ నుంచి తోట అక్కయ్య రెండు సెట్లు, టిడిపి నుంచి పల్లా శ్రీనివాసరావు మూడు సెట్లు, వైసిపి నుంచి గుడివాడ అమర్‌నాథ్ రెండు సెట్లు, వైసిపి నుంచి రంగూరి హిమగౌరి రెండు సెట్లు సమర్పించారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి టిడిపి నుంచి పిజివిఆర్ నాయుడు (గణబాబు) మూడు సెట్లు, పెతకంశెట్టి మౌర్య సింహ ఒక సెట్, వైసిపి నుంచి ఆడారి మాలతి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా పిల్లా రమాకుమారి ఒక సెట్, సమాజ్ వాదీ పార్టీ నుంచి వెలగాడ రవికుమార్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థినిగా జమ్మి పార్వతి ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.

అనకాపల్లి పార్లమెంటు స్థానానికి బుధవారం 15 నామినేషన్లను వేయగా జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు 24 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్లమెంట్ స్థానానికి భారతీయ జనతా పార్టీ నుంచి సిఎం.రమేష్ రెండు సెట్లు, వైసిపి నుంచి బూడి ముత్యాలనాయుడు, డాక్టర్ బివి.సత్యవతి, ఉప్పలపాటి సుకుమార్ వర్మ నాలుగు సెట్లు, కాంగ్రెస్ పార్టీ నుంచి వేగి వెంకటేష్, గార సూర్యారావు, దళిత బహుజన సమాజ్ పార్టీ నుంచి వడ్లమూరి కృష్ణ స్వరూప్, బహుజన సమాజ్ పార్టీ నుంచి పలక శ్రీరామ్ మూర్తి, లంబ శ్రీనివాసరావు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి నమ్మి అప్పలరాజు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దాడి పూర్ణచంద్రరావు, తెలుగుదేశం పార్టీ నుంచి ప్రగడ అన్నపూర్ణ, జనసేన పార్టీ నుంచి సుందరపు విజయకుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా మెరుగు రాజు బాబు, తుమ్మపాల హరిశంకర్ దాఖలు చేశారు. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి చోడవరం నియోజవర్గం నుంచి వైసిపి తరపున కరణం ధర్మశ్రీ, కాంగ్రెస్ తరపున జె.శ్రీనివాసరావు, సిపిఐ ఎమ్ఎల్ నుంచి సవరాల గణేష్, మాడుగుల నియోజకవర్గం నుంచి టిడిపి నుంచి బండారు మాధవి లత, స్వతంత్ర అభ్యర్థులుగా మల్ల ఆరినాయుడు, బూడి రవికుమార్, పైలా ప్రసాదరావు, మల్లారపు లోవ, అనకాపల్లి నుంచి వైసిపి అభ్యర్థిగా మలసాల భరత్ కుమార్, తదితరులు నామినేషన్ పత్రాలు సమర్పించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం : బొత్స

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :విశాఖ రాజధానిగా, ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే లక్ష్యమనిరాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని ఎంపీ అభ్యర్థి ఝాన్సి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, విశాఖ పాలనారాజధానితోపాటు ఉత్తరాంధ్ర 34 ప్రాంతాల్ని అభివృద్ధి చేస్తామన్నారు. మతిస్థిమితం కోల్పోయినట్లు మాట్లాడుతున్న చంద్రబాబును చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. పేద విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టుకోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడోతరగతి నుంచే పిల్లలకు టోఫెల్ శిక్షణనిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సిబిఎస్ఇ సిలబస్‌తో నడిచే హైస్కూళ్ల సంఖ్యను వంద నుంచి వెయ్యికిపైగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు కొత్తగా వస్తున్నాయని,దాదాపు 1700 అదనపు మెడికల్ సీట్లులో 70 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయిస్తామన్నారు.. మెడికల్ కాలేజీకి అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి, పేదలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తామన్నారు.

28న గౌడ వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 5గంటల వరకు గౌడ ఎడ్యుకేషనల్ అవార్డుల ప్రదానం, గౌడ ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్టు విశాఖ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు మార్గాని రామారావు గౌడ్ తెలిపారు. బుధవారం జగదాంబ జంక్షన్‌లోని సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..వివాహ పరిచయ వేదిక కొరకు ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల నుంచి గౌడ సంఘీయులు వస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గౌడ కుటుంబాల్లోని పిల్లల ఎడ్యుకేషనల్ అవార్డుల కోసం సర్టిఫికెట్లు నేరుగా గాని, పోస్టల్ ద్వారా గాని ఈనెల 26 లోపు 94404 28182 నెంబర్‌కు వాట్సాప్ గ్రూప్‌లో పంపాలని కోరారు.

కార్యక్రమంలో గౌడ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కామన వెంకట సుబ్బారావు,ప్రధాన కార్యదర్శి దీవి నారాయణ గౌడ్, గౌరవ అధ్యక్షులు జెర్రిపోతులప్రసాద్ గౌడ్, అత్తిలి శంకరరావు గౌడ్, మహిళా కోఆర్డినేటర్ యరకల భవాని గౌడ పాల్గొన్నారు.

గుండెపోటులో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - మునగపాక: మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన పక్కుర్తి రమణమ్మ (73) అనే ఉపాధి కూలీ పనిప్రదేశంలో బుధవారం గుండెపోటుతో మరణించింది. స్థానిక ఎంపిడిఒ మన్మధరావు అందించిన వివరాల ప్రకారం రోజువారీ మాదిరిగానే తోటి కూలీలతో ఉపాధి పనికి వెళ్లిన రమణమ్మ, పనిచేస్తుండగా ఉదయం 6:15 గంటలకు అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. తోటికూలీలు గమనించి, సపర్యలు చేయడంతోపాటు వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. వితంతువైన రమణమ్మకు నలుగురు కుమారులున్నారు. పనిప్రదేశంలో రమణమ్మ మృతి విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎంపిడిఒ తెలిపారు.

టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జిగా సీతంరాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ దక్షిణ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జిగా సీతంరాజు సుధాకర్‌ను నియమించారు. పార్టీ జాతీయాధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జిగా ఉన్న గండి బాబ్జీని పెందుర్తి ఇన్‌ఛార్జిగా నియమించారు. విశాఖ జిల్లా అధ్యక్షుని బాధ్యతలను కూడా బాబ్జి నిర్వహించనున్నారు. సీతంరాజును పలువురు అభినందించారు.

మలేరియాపై గిరిజనులను చైతన్యం చేయండి

ప్రజాశక్తి పాడేరు: మలేరియా నివారణ పై ప్రజలను చైతన్యవంతం చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ స్పష్టం చేశారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా విభాగం రూపొందించిన ఫ్లెక్సీని ఆయన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదట విడత దోమల మందు పిచికారిపై ఆరా తీశారు. నిర్దేశించిన గడువు లోపు పిచికారి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

మలేరియాను నియంత్రించడానికి ప్రతి ఏటా ఏప్రిల్ 25న వార్షిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్ ప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా వెల్లడించారు. బుధవారం జిల్లా మలేరియా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తీవ్రమైన తలనొప్పి, వొళ్ళు నొప్పులు, చలి వణుకుతో కూడిన జ్వరం, చెమటలు పట్టడం, వాంతులు వికారం వంటివి ప్రధాన లక్షణాలని తెలిపారు.ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రి, ఆరోగ్య కార్యకర్తల వద్ద రక్త పరీక్ష చేయించుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలని. పూర్తి చికిత్స తీసుకోవాలని సూచించారు. పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు,' పారేసిన టైర్లు, రుబ్బు రోళ్ళు, ప్లాస్టిక్ పాత్రల్లో దోమల లార్వా పెరిగే అవకాశం ఉందన్నారు. ఫ్రిడ్జ్ లు, ఎయిర్ కూలర్లు, ఫ్లవర్ వాజ్ లు దోమల ఉత్పత్తి వనరులుగా ఉన్నందున ప్రజలు వాటిల్లో నీటిని ప్రతీ మూడు రోజులకు ఖాళీ చేయాలని సూచించారు.ప్రజలు సహకరించి ఇంటిలోపల గోడలకు పిచికారి చేయించుకోవాలన్నారు. మూడు నెలల వరకు సున్నము వేయరాదన్నారు. ముఖ్యముగా గర్భిణీలు, పిల్లలు తప్పనిసరిగా దోమ తెరలలోనే నిద్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌డిఎ ప్రభుత్వ గొప్పలకే పరిమితం

(మొదటి పేజీ తరువాయి..) ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధించుకోవడం, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపే ప్రయత్నం చేస్తారని నమ్మబలికే ప్రయత్నం చేశారు. అనకాపల్లి లోక్‌సభ బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ జిల్లా అభివృద్ధికి సంబంధించి చేపట్టబోయే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రధానిని పొగడ్డానికి పరిమితమయ్యారు. తాను సమర్థుడనని సొంత గొప్పలకు పోయారు.

వేగి వెంకటేష్ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి..)

నాలుగు రోడ్ల జంక్షన్, సారా బందా మీదుగా సుంకర మెట్ట జంక్షన్ నుండి శంకరం వరకు ఉత్సాహంగా సాగింది. అనంతరం జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రవి పఠాన్‌శెట్టికి నామినేషన్ పత్రాన్ని వెంకటేష్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, అనకాపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్.గంగాధర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డ శ్రీనివాస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, పెందుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భగత్, యలమంచిలి నియోజవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంత్, పాయకరావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బోను తాతారావు, సిపిఎం జిల్లా నాయకులు జి.కోటేశ్వరరావు, గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దాసరి సంతోష్, అనకాపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కట్టమూరి సూకప్పారావు, కశింకోట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సన్యాసి గజ్జాలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎగ్గడ భాస్కరరావు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో 112 కేసులు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గడిచిన నాలుగు నెలల్లో 112 కేసులు నమోదు చేసినట్లు రంపచోడవరం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ నాగరాజు తెలిపారు. 88 మందిపై కేసులు నమోదు చేశామని, 253 లీటర్ల సారాను, సుమారు 41,500 లీటర్ల ధ్వంసం చేశామని పేర్కొన్నారు. అక్రమంగా తరలిస్తున్న 55 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఈ కేసుల్లో రెండు ద్విచక్ర వాహనాలు, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముద్దాయిలుగా ఉన్న వారిని స్థానిక ఎమ్మార్వో సమక్షంలో సుమారు 80 మందిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

ప్రజాశక్తి-సీలేరు : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో అసాంఘిక శక్తులతో చేతులు కలిపి ఎటువంటి గొడవలు సృష్టించరాదని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని సీలేరు ఎస్ఐ రామకృష్ణ పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ నేలజర్త గ్రామంలో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు.

మహారాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 165/2022
O.S.No. 45/2022

Shaik Farooq Hussian, S/o Ameer Basha, aged about 50 years, Business, Residing at D.No. 21/640-1, Old Savali School Complex, LIC Road, Proddatur town&Mandal, YSR Kadapa District.
...Petitioner/Plaintiff

Vs

Shaik Muzafar Ahmed, S/o Mahaboob Badusha, aged about 46 years, Business, Muslim, Residing at D.No.39-4-2/1/3, Anusha Enclave, Plot No.103, Varma Complex, Sector-4, Murali Nagar, Vishakapatnam City & District.
...Respondent/Defendant

SUMMONS & NOTICES

పై నెంబరు I.A.No.165/2022 in O.S.No.45/2022 కేసులో రాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో రెస్పాండెంటు/డిఫెండెంట్ పై రాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గారి ఉత్తర్వుల మేరకు ఈ సమన్లు మరియు నోటీసులను ప్రచురించబడుచున్నది. కావున వాయిదా తేది 01/05/2024న రెస్పాండెంటు/డిఫెండెంటు వ్యక్తిగతంగా కానీ, అడ్వకేటు వరంగా కానీ మహారాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారికోర్టులో హాజరు కావల్సి ఉన్నది. లేనియెడల మహారాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారు తగు చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

//By Order of the Court//

SYED KALEEMULLA
వాది తరపున అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

రామచంద్రనగర్‌లో డంపింగ్‌యార్డును ఎత్తివేయాలి

ప్రచారం చేస్తున్న జగ్గునాయుడు, జగన్ తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : రామచంద్రనగర్‌లోని డంపింగ్ యార్డును ఎత్తివేయాలని ఇండియా ఫోరం బలపర్చిన సిపిఎం గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. జివిఎంసి 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్, రామచంద్రనగర్, రిక్షాకాలనీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ డంపింగ్‌యార్డు వల్ల 16 గ్రామాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. మరోపక్క, గంగవరం పోర్టు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఎప్పుడూ లేని విధంగా కేన్సర్ రోగాల సంఖ్య పెరుగుతోందన్నారు. విశాఖ డెయిరీ వల్ల కూడా కాలుష్యం పెరుగుతోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం వల్ల గాజువాక అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందని, అటువంటి ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మాలని చూస్తుందని, దానికి టిడిపి, జనసేన, వైసిపి కూడా మద్దతు పలుకుతున్నాయని వివరించారు. సిపిఎం ఒక్కటే బిజెపిని ఎదిరిస్తుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం సిపిఎం పోరాటం చేస్తుందన్నారు. ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఎన్నికల ప్రచార యాత్రలో ప్రతి ఇంటికీ వెళ్తూ తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని జగ్గునాయుడు కోరారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం సిపిఎమ్‌ను గెలిపించాలని కోరారు. అన్ని కాలనీలోనూ మహిళలు, వృద్ధులు యువకులు, జగ్గునాయుడు ఎన్నిక ప్రచారానికి స్వాగతం పలికారు. మంగళ హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. ప్రచార కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు డి.రమణ, ఎం.శ్రీదేవి, జగన్, స్థానిక సానుభూతిపరులు పాల్గొన్నారు.

పశ్చిమలో అత్తిలి విమల ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

మాధవధార : విశాఖ పశ్చిమ నియోజకవర్గ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల బుధవారం గొల్ల కంచరపాలెం, గవర కంచరపాలెం, చేపల కంచరపాలెం, తోటవీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ, అందరినీ పలకరిస్తూ, వారి సమస్యలను వింటూ ప్రచారం సాగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను, వామపక్ష నేతలు చేసిన ఉద్యమ ప్రస్థానాన్ని వివరిస్తూ ఇండియా ఫోరం బలపరిచిన అత్తిలి విమలను గెలిపించాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ, సోమేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టరు సీతల్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్, నాయకులు బి.పరమేశ్వరి, పడాల గోవింద్, ఎన్.మధు, ఆడారి ఆదినారాయణ, వి.నల్లయ్య, క్షేత్రపాల్, యు.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో సిపిఐ ప్రచారం

గోపాలపట్నం : అత్తిలి విమల విజయాన్ని కాంక్షిస్తూ వెంకటాపురం, సాయినగర్, పద్మాపురం ప్రాంతాల్లో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఎన్ఎడి న్యూ కాలనీ, మర్రిపాలెం, న్యూ కరాస తదితర ప్రాంతాల్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిఎన్‌క్షేత్రపాల్ ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ అంశంలో వైసిపి దోబూచులాట ఆడుతోందని, ప్రధాన ప్రతిపక్షం టిడిపి కూడా నోరుమెదపడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో ప్లాంట్ పరిరక్షణ ఇండియా ఫోరమ్‌తోనే సాధ్యమౌతుందని వివరిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నల్లయ్య పాల్గొన్నారు.

కంచరపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

వైసిపి విస్తృత ప్రచారం

91వ వార్డులో ప్రచారం చేస్తున్న ఆడారి మాలతి, బెహరా భాస్కరరావు తదితరులు

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి జయప్రకాష్‌నగర్, మేదరవీధి, గణేష్‌నగర్‌లో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సతీమణి ఆడారి మాలతి ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుందన్నారు. వైసిపి మరలా అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ఆడారి ఆనంద్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటారని తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో కెకె.రాజు ఇంటింటి ప్రచారం

సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధి ఎస్ఆర్.నగర్‌లో వార్డు కార్పొరేటర్ కంపా హనూక్ ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. గత ఐదేళ్లగా ఈ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, నాయకులు సేనాపతి అప్పారావు, పైడి రమణ, హరి పట్నాయక్, రాయుడు శ్రీను, రాజు యాదవ, జోగి నాయుడు, నేపాల్ శ్రీను, ఆదిలక్ష్మి, దుర్గ, సన్నీ, ఈశ్వరరావు, డి.సతీష్ పాల్గొన్నారు.

45వ వార్డు వైసిపి అధ్యక్షుడు పైడి రమణ, కార్పొరేటర్ కంపా హనూక్ ఆధ్వర్యాన వాసుదేవనగర్, సంతోషిమాత కాలనీలకు చెందిన 30 మంది వైసిపిలో చేరారు. వారికి కెకె రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కెకె.రాజు కోరారు.

25వ వార్డులో పాదయాత్ర

జివిఎంసి 25వ వార్డులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25వ వార్డులో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సారిపల్లి గోవింద, సంపంగి శ్రీనివాసరావు, సనబోయిన సురేష్, గోవింద పాల్గొన్నారు.

జివిఎంసి 46వ వార్డులోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కెకె.రాజును గెలిపించాలని నాయకులు కోరారు.

128 మంది గీతం సైన్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ నుంచి బిఎస్సీ, ఎమ్మెస్సీ, ఎమ్‌సిఎ తదితర కోర్సులు అభ్యసిస్తున్న 128 మంది విద్యార్థులను ప్రముఖ కంపెనీలు ప్రాంగణ నియామకాలలో ఎంపిక చేసుకున్నాయని గీతం కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ సీనియర్ మేనేజర్ ప్రభా రాజమహంతి తెలిపారు. విద్యార్థులలో పలువురు రూ.14.25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. లారెస్ బయో, విరజాన్, జిందాల్ బయోసిస్, ఎడిపి, ఎక్సెంచర్, ఆక్జాన్ లైఫ్ సైన్స్, ఫెడరల్ బ్యాంక్, ఇండియన్ ఇమ్యునాలజి, బయోలాజికల్ - ఇ,స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఈ నియామకాలను నిర్వహించాయన్నారు. డీన్ డాక్టర్ కెఎస్.కృష్ణ అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం సొంఠ్యాం సబ్‌స్టేషన్ 11కెవి, మామిడిలోవ 11కెవి సొంఠ్యాం ఇండస్ట్రియల్ లైన్ నిర్వహణ పనుల కోసం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆపరేషన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పొలాంకి శ్రీనివాసరావు తెలిపారు. రామవరం, సొంఠ్యాం, జివిఎస్.అగ్రహారం, గండిగుండం, మామిడిలోవ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విస్తృతంగా నాగమణి ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలోని అనంతవరం, పెంట, కొవ్వాడ గ్రామాల్లో భీమిలి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి నాగోతు నాగమణి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీధివీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని కొనసాగించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, రోడ్ల అధ్వాన తదితర సమస్యలను గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతవరం గ్రామంలో మురుగు నీరు ఎక్కడికక్కడే ఉండడంతో దోమలు ప్రబలి అనారోగ్యాలకు గురవుతున్నామని ఆమెకు వివరించారు.

మాజీ సైనికోద్యోగుల సంక్షేమ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడలో దివీస్ సంస్థ ఆధ్వర్యాన రూ.18 లక్షలా 29 వేలా 439తో నిర్మించిన మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయాన్ని బుధవారం దివీస్ సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు సూరిబాబు, సంస్థ జిఎం ఎంఎస్ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ముత్తంశెట్టి నామినేషన్‌లో అపశృతి - ర్యాలీలో ఆటో నుంచి పడి ఒకరు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, మామిడిలోవ పంచాయతీకి చెందిన గండి బోయిన సన్యాసప్పుడు (67) వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నామినేషన్ ర్యాలీకి వెళ్లారు. ఆటలో వెళ్తుండగా మామిడిలోవ హైవేపై మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆటోలో ముందు కూర్చున్న సన్యాసి అదుపుతప్పికింద పడిపోయాడు. బలంగా దెబ్బలు తగడంతో తగరపువలస ఎన్నారై హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... నెల్లూరు జిల్లాకు చెందిన ఆర్.మధుబాబు కొమ్మాది వికలాంగుల కాలనీలో ఉంటూ 14వ బెటాలియన్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న విధులు ముగించుకొని వెళ్లిన మధుబాబు తిరిగి 22న విధులకు హాజరు కాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. మధుబాబు సోదరుడు హరిబాబు పరిసర ప్రాంతాల్లో వెతికాడు. ఎక్కడా ఆచూకీ కానరాలేదు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం లోన్ యాప్‌ల నుంచి భారీ మొత్తంలో రుణాలు పొందినట్లు లేఖ ద్వారా తెలిసింది. ఈ మేరకు హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్రంపాలెంలో 'గుంటూరు' ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం, బొడ్డునాయుడుపాలెంలో పెందుర్తి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి గుంటూరు నరసింహమూర్తి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాను ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగానని, నియోజకవర్గ ప్రజలకు నిత్యమూ అందుబాటులో ఉంటానని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతంలో సమస్యలన్నీ తెలుసని, గెలిచిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

12వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన బుధవారం టిడిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తూర్పు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావుతో కలిసి దుర్గానగర్, నెహ్రూనగర్, లీలా సుందరయ్యనగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలుచేయబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కలిసి పని చేస్తేనే గెలుపు : కంచర్ల

ప్రజాశక్తి -ఆరిలోవ : అందరినీ కలుపుకుంటేనే తూర్పు నియోజకవర్గంలో వైసిపి గెలుపు సాధ్యమవుతుందని వైసిపి సీనియర్ నాయకుడు కంచర్ల అచ్యుతరావు అన్నారు. ఆరిలోవలోని ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి కార్యక్రమాలకు తనను ఎందుకు పిలవడం లేదని ప్రశ్నిస్తే కంచర్ల వస్తే జై కంచర్ల అని వెనుక వచ్చే వ్యక్తులు నినాదాలు చేస్తున్నారని, దీని వల్ల ఎమ్మెల్యే అభ్యర్థి పేరు వినిపించడం లేదని వైసిపి వర్గాలు చెబుతున్నాయని తెలిపారు. పార్టీని ముందుకు తీసుకెళ్లాలని తాను కృషి చేస్తుంటే, తాను వెనుకడుగు వేసేలా కొందరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంవివి సత్యనారాయణ, కార్పొరేటర్లు తనకు సహకరించి కలిసి కట్టుగా పనిచేస్తేనే తూర్పులో వైసిపి జెండా ఎగురుతుందన్నారు. పార్టీలో కొందరి వైఖరి విశాఖ ఎంపీ అభ్యర్థి ఝాన్సీ గెలుపు మీద ప్రభావం పడుతుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు చిన్నా, పారిపల్లి రామారావు, శ్రీనివాస్, వాసు, రెహమాన్, సుధీర్, కె.శ్రీను, చెవ్వేటి రమణమ్మ, రమణ, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ ఇంఛార్జి డి.సుధీర్ పాల్గొన్నారు.

దంత వైద్య విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో బిడిఎస్ ఫైనల్ ఇయర్ వైద్య విద్యార్థులకు, హౌస్ సర్జన్లకు పలు అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. పుదుచ్చేరికి చెందిన దంత వైద్య నిపుణులు డాక్టర్ కవిప్రియ మాట్లాడుతూ, దంత వైద్యంలో మార్పులను అందిపుచ్చుకొని అందుకనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
గురువారం
25 ఏప్రిల్ 2024

కలం మాట



క్షణానికో కండువా..

మలేరియా దోమ కుడితే
అనారోగ్యానికి ఖర్చంతా తమదేనంటూ
క్షణానికో పార్టీ కండువా కప్పేసుకుని
మంత్రాలు వేస్తూ
తంత్రాలు చేస్తూ
తాయెత్తులు కడుతూ
కుతంత్రాలకు తెరదీస్తూ
చేస్తుంటారు రాజకీయం
నీ మీద ఆధిపత్యం కోసం
ఆపసోపాలు పడుతూ, లేస్తూ
ఐదేళ్ల అధికారం కోసం
నీ తల రాతను మార్చే
విలువైన ఓటు కోసం..
వేస్తున్నారు...క్షణానికో కండువా..
చేస్తున్నారు.. నిలువెల్లా మోసం, దగా..!

అప్పు ఎంతో తెలీదంటూ
రుణమాఫీ చేస్తామంటూ
నీ భవిత జాతకం చెప్తామంటూ
కల్లిబొల్లి లెక్కలతో
గుడి కడతామంటూ
మడిచెక్కలిస్తామంటూ
మేఘాల్ని తిప్పేస్తామని
నదుల దారుల్ని, తీరుతెన్నుల్ని మార్చేస్తామని
కాలువలన్నీ కప్పేసి
మురికి కాలువలకు తోవే లేనట్లు

-పెంటకోట లక్ష్మీనరసింహం,
కవి, రచయిత, పెందుర్తి
మొబైల్: 94416 07235

గంగవరం కార్మికుల వెట్టి బతుకులు!

- గంగవరం కార్మికుల రోజుకు 12 గంటల పని ..15 ఏళ్లుగా రూ.3700 బేసిక్ వేతనం
- రూ.వందల కోట్ల వ్యాపారం చేసే పోర్టుకు కిల్లీ దుకాణం చట్టమా?
- అటకెక్కిన జెట్టీ నిర్మాణ హామీ
- 700 మంది కార్మికులకు ఉపాధికి గండి
- కార్మికుల కష్టాలను పట్టించుకోని వైసిపి, టిడిపి
- పాలకుల దుర్నీతిని ఎండగడుతున్న సిపిఎం

గాజువాక పారిశ్రామిక ప్రాంతం గంగవరంలో 15ఏళ్ల క్రితం ఏర్పాటైన ప్రైవేట్ పోర్టు యాజమాన్యం మత్స్యకార కార్మికులను వెట్టిచాకిరీలో ముంచెత్తుతోంది. కనీస కార్మిక చట్టాలను లెక్కచేయకుండా, 12 గంటల పనిని బలవంతంగా రుద్దుతోన్నా, గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. రోజువారీ 12 గంటల పనిలో ఐదారుగంటలు ఏకంగా పూర్తి దుమ్ము, ధూళిలోనే ప్రతి కార్మికుడు పనిచేసే దుస్థితి. యాజమాన్యం కనీస వేతనం ఊసెత్తకపోగా, 15ఏళ్ల క్రితం పోర్టు స్థాపించినప్పటి నుంచి నేటికీ రూ.3700లు బేసిక్ స్కేలే అమల్లో ఉంది. గంగవరం పోర్టులోని10శాతం ప్రభుత్వ వాటాను కూడా 2022లో అదానీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా అప్పగించేయడంతో, తర్వాత కార్మికులపై యాజమాన్యం ఆగడాలు పేట్రేగిపోతున్నాయి.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలపై ఆందోళనలో మాట్లాడుతున్న గాజువాక సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / గాజువాక

ఏటా రూ.వందల కోటకల సరకు రవాణా ఎగుమతి, దిగుమతులు చేసే గంగవరం పోర్టు యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంతో తీవ్ర దోపిడీ చేస్తోంది. పోర్టు ప్రారంభంలో 300 మంది మత్స్యకారులకు ఉపాధి ఇచ్చినా, వారికి రూ.8వేలకు మించి వేతనం దాటలేదు. సముద్రాన్ని, భూములను త్యాగం చేసిన దిబ్బపాలెం, చేపలపాలెం, గంగవరం గ్రామాల్లో మరో 700 మందికి ఉపాధి ఇస్తానని ఒప్పందం చేసుకున్నా, యాజమాన్యం దాన్ని తుంగలో తొక్కి, కోర్టులనాశ్రయిస్తూ మత్స్యకార కార్మిక కుటుంబాల పొట్టకొడుతోంది. పోర్టు విస్తరించుకుంటూ పోతోన్న ఆదానీ యాజమాన్యం, నిర్వాసిత గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం నిర్లక్ష్యం చేస్తూనే ఉంది. 2005లోనే జెట్టీ నిర్మాణం చేపట్టి, మత్స్యకారుల ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటానని గంగవరం పోర్టు యాజమాన్యం ఒప్పందంలో అంగీకరించినా, దాన్ని అమలు చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయి. కేంద్రంలోని బిజెపి అండతో అదానీ గంగవరం యాజమాన్యం ఆగడాలకు అంతే లేకుండాపోయి, చట్టాలన్నిటినీ తుంగలోకి తొక్కుతూ, ఈ ప్రాంత మత్స్యకారులు, కార్మికులను అణచివేస్తోంది.

పక్కనే వైజాగ్ పోర్టులో రూ.36వేల జీతం

ఆదాని గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు కష్టానికి తగ్గ ఫలితం లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. విపరీతమైన దుమ్ము , ధూళిమధ్య పనిచేస్తున్న వీరికి జీతాలు చెల్లించడంలో యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తుంది. విశాఖపట్నం పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు రూ.36 వేల నెలసరి వేతనం చెల్లిస్తుంటే, అదే ఆదాని గంగవరం పోర్ట్ కార్మికులకు కేవలం రూ.15వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ పోర్ట్ నిర్మాణానికి ముందు మత్స్యకార కార్మికులందరూ సముద్ర వేట చేసుకొని జీవనం సాగించేవారు. పోర్టు నిర్మాణంతో వీరి జీవితాలు మెరుగుపడతాయని, ఆర్థికంగా లాభపడతాయని భావించినప్పటికీ, ఇందులో ఉద్యోగాలు వచ్చిన తర్వాత నిర్వాసిత కార్మికుల జీవితాలు అగమ్య గోచరంగా తయారయ్యాయి.

గంగవరం కార్మికుల ఆందోళనలకు సిపిఎం నిరంతరం అండ

పోర్టులో కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యం ఆగడాలపై సిపిఎం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పోరాడుతోంది. పోర్టులోని అనేక విభాగాల్లో కార్మికులకు అదనపు పనికి, ఓవర్ టైం వేతనాలు చెల్లించడం లేదు. ఈ విధంగా కార్మికులను దోచుకుంటున్న క్రమంలో సిపిఎం ఆందోళనలతో కొన్ని విభాగాల్లో ఓటిలకు వేతనం లభిస్తోంది. కనీస భద్రత చర్యలు చేపట్టకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరగడం, ప్రమాదాల్లో కార్మికుల దుర్మణం పాలవుతున్నారు. ఇలాంటి కుటుంబాలకు ఉద్యోగాలివ్వకుండా చేస్తోంది. లేబర్ బేసిక్‌ను తగ్గించి చూపడం వల్ల సగటు కార్మికుడు ఉద్యోగ విరమణ సమయంలో చాలా నష్టపోతున్నారు. మెడికల్ సదుపాయం పోర్టులో అందడం లేదు. గాజువాకలో ఉన్న కిమ్స్ హాస్పిటల్ తప్ప, మిగతా హాస్పిటల్స్‌కు రిఫర్ చేయడం లేదు.

పోర్టు కార్మికులు బయట వేరే పనుల్లో...

పోర్టు యాజమాన్యం దోపిడీతో వచ్చిన జీతాలతో భార్యాబిడ్డలను పోషించుకోలేని దుస్థితిలో గంగవరం పోర్టు కార్మికులు తమ పనివేళలు ముగిసిన తర్వాత పార్ట్ టైంగా ఆటో నడుపుతూ, స్విగ్గి, జొమోటో, కొరియర్ బాయ్‌లుగా తాత్కాలికంగా పనులు చేసుకుంటూ అదనపు ఆదాయార్జనకు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాలన్నిటినీ ప్రభుత్వ అధికారుల దృష్టికి పదేపదే సిపిఎం తీసుకెళ్లినా చర్యల్లేవు. పోర్టులో కష్టమైన పనులు చేస్తూ, మరోపక్క పార్ట్ టైం ఉద్యోగాలు చేయలేక కార్మికులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. దీనిపై ప్రశ్నించే కార్మికులను ఏదో ఒక కుంటిసాకుతో సాగనంపే చర్యలు పోర్టులో తీవ్రమయ్యాయి. పైగా కొల్‌కత్తా, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లోని ఆదానీ యాజమాన్యంలోని సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపేస్తామంటూ కార్మికులను గంగవరం పోర్టు యాజమాన్యం బెదిరిస్తోంది.

కార్మికుల సమస్యలు పట్టని ప్రధాన పార్టీలు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు ఏనాడు వైసిపి, తెలుగుదేశం పార్టీలకు పట్టిన పాపాన పోలేదు. వీరి సమస్యలపై ఆయా పార్టీలు ఏనాడూ పోరాడిన సందర్భాలూ లేవు.గతంలోనూ, ఇప్పుడు పోర్టులో జరుగుతున్న కార్మిక పోరాటాలకు వీరు సంఘీభావం చెప్పిన దాఖలాలూ లేవు. సిపిఎంఒక్కటే, గతంలో జరిగిన పోరాటంలో అండగా నిలిచింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు స్వయంగా వచ్చి కార్మికుల తరపున మేమున్నామని మద్దతు తెలిపారు. మళ్లీ ఇప్పుడు జరుగుతున్న పోరాటానికి కూడా, ఆయన స్వయంగా కార్మికులకు భరోసానిస్తూ, భయపడాల్సిన అవసరం లేదని మద్దతు తెలిపారు. సిపిఎం, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మొదటి నుండి ఆదాని గంగవరం పోర్ట్ కార్మికులకు మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు. వారి సమస్యలపై ఏళ్లతరబడి పోరాటాలు చేస్తూనే ఉన్నారు. పోర్టు కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ దష్టికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు వినతిపత్రం కూడా అందజేశారు. ఈ సమస్య పరిష్కారం అయ్యేటట్లు చూడాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలోగానీ, గతంలో అధికారంలో ఉన్నప్పుడు గానీ ప్రధాన పార్టీలకు, ప్రభుత్వాలకు గంగవరం కార్మికుల బాధలు పట్టడం లేదు.

నామినేషన్ సమర్పిస్తున్న దక్షిణ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖ కలెక్టరేట్ : కూటమి బలపరిచిన విశాఖ దక్షిణ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నుబోయిన వంశీకృష్ణశ్రీనివాస్ బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. పోలీసు బ్యారెక్స్, జగదాంబ జంక్షన్ మీదుగా మెయిన్‌రోడ్డు గుండా టర్నర్ చౌల్ట్రీ వరకు వేలాది మంది కూటమి శ్రేణులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అందించారు. టిడిపి ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కందుల నాగరాజు, సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్‌ఒ భాస్కరరెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ముత్తంశెట్టి

భీమునిపట్నం : భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం 1.43 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు భార్య జ్ఞానేశ్వరి, ఎంపీ అభ్యరి బొత్సఝాన్సీలక్ష్మి, వైవి సుబ్బారెడ్డితో కలిసి వెళ్లి ఆర్‌ఒ భాస్కరరెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పార్టీ జెండాలు, బెలూన్లు, కోలాటం, తీన్ మార్, కొమ్ము డ్యాన్సులు, తప్పెటగుళ్ళు, డప్పుల మోతల మధ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పండగ వాతావరణంలో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పాల్గొన్నారు.



నామినేషన్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల

పెందుర్తి: కూటమి బలపరిచిన పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పెందుర్తి కూడలి నుంచి పురుషోత్తపురం, సుజాతనగర్, చిన్నముషిడివాడ మీదుగా వేపగుంట వరకు టిడిపి, బిజెపి, జనసేన పార్టీశ్రేణులతో ర్యాలీగా ఆర్‌ఒ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను అందజేశారు. జనసేన స్టార్ క్యాంపైనర్ హైపర్ ఆది ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, బండారు అప్పలనాయుడు,శ్రీనివాస్‌నాయుడు, గొర్లె రామునాయుడు, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు సేనాపతి వసంత్ శంకరరావు, రాపర్తి కన్నా, పీలా శ్రీనివాసరావు, ముల్లి ముత్యాలనాయుడు పాల్గొన్నారు

కూటమి పార్టీల శ్రేణుల కోలాహలం మధ్య నామినేషన్‌కు వెళుతున్న గణబాబు

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థిగా కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి పి.గణబాబు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తన స్వగృహం నుంచి కూటమి శ్రేణుల కోలాహలం మధ్య గోపాలపట్నం, ఎన్ఎడి కొత్తరోడ్డు, మర్రిపాలెం, రామ్మూర్తి పేట మీదుగా ర్యాలీగా వెళ్లి జ్ఞానపురంలోనిరిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో జానపద నృత్యాలు, కోలాడ్యాన్సులు ఇతర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రహదారి మొత్తం పసుపుమయమైంది. ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ పాల్గొన్నారు. గణబాబుకు డాక్టర్లు, లాయర్లు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ పెద్దలు సంఘీభావం తెలిపారు.

నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

అనకాపల్లి :అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మలసాల భరత్‌కుమార్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. రింగ్ రోడ్, మెయిన్‌రోడ్, చిన్న నాలుగు రోడ్ల జంక్షన్, ఎన్టీఆర్ స్టేడియం, నెహ్రూ చౌక్ జంక్షన్, రామచంద్ర థియేటర్ జంక్షన్ మీదుగా గుండాలు జంక్షన్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ సత్యవతి, దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ కాశీవిశ్వనాథం, బివి సత్యవతి, మందపాటి జానకి రామరాజు, ఎంపిపి గొర్లి సూరిబాబు, కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కరరావు, పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, పెద్దిశెట్టి గోవింద, ఏ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కలగా గున్నయ్య నాయుడు, వివిధ ఆలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కెఎం నాయుడు, నుదురుపాటి తాతాజీ పాల్గొన్నారు.

నామినేషన్లు షురూ..!

నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న తూర్పు వైసిపిఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి

ఎంవిపి కాలనీ/కలెక్టరేట్ :విశాఖ తూర్పు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆరిలోవ చివరి బస్‌స్టాప్‌లోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి, సర్వమత ప్రార్థనలు అనంతరం వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి. తోటగరువు జంక్షన్, హనుమంతవాక, అప్పుగర్ రోడ్డు, లాసన్సుబే కాలనీ, పెదవాల్తేరు, సిరిపురం జంక్షన్ మీదుగా వేలాదిమంది వైసిపి శ్రేణులు కేరింతల మధ్య కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకుని ఆర్‌ఒ మయూర్ అశోక్‌కు నామినేషన్ అందజేశారు.ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్

గాజువాక : గాజువాక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గుడివాడ అమర్‌నాథ్ బుధవారం నిర్ణయించిన ముహూర్త సమయానికి నామినేషన్ దాఖలు చేశారు. మింధిలోని స్వగృహం నుంచి తన తల్లి నాగమణి, గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైసిపి అధికార ప్రతినిధి ఉరుకూటి అప్పారావుతోపాటు భారీసంఖ్యలో పార్టీ శ్రేణులతో జింక్‌గేటు, కొత్త, పాతగాజువాక మీదుగాతహశీల్దార్ కార్యాలయం వరకు ఓపెన్‌టాప్ జీపులో ఓటర్లకు అభివాదంచేస్తూ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అందజేశారు.

ఆర్‌ఒకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా

గాజువాక : కూటమి పార్టీలు బలపరిచిన గాజువాక నియోజవర్గ తెలుగుదేశం అభ్యర్థిగాపల్లా శ్రీనివాసరావు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కణితి రోడ్డు జంక్షన్ నుంచి జగ్గుజంక్షన్ మీదుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి, రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.టిడిపి అభ్యర్థి పల్లాతోపాటు జనసేన నేత కోన తాతారావు, బిజెపి నేత కరణంరెడ్డి నర్సింగరావు, టిడిపి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు వెళ్లి ఆర్‌ఒకు నామినేషన్ సెట్‌ను అందజేశారు. నామినేషన్ ర్యాలీలో పెద్దసంఖ్యలో మహిళలు, యువకులు, మూడు పార్టీల శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

చోడవరంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ నామినేషన్ ర్యాలీ

చోడవరం : జన సందోహం మధ్య చోడవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ బుధవారం నామినేషన్ వేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి కార్లు, బైక్‌లు, ఆటోలు, ఇతర వాహనాల్లో పెద్దఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులతో స్థానిక కాలేజీ గ్రౌండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రిటర్నింగ్ అధికారికి నామినేషన్ ప్రతాలను సమర్పించారు. ధర్మశ్రీతోపాటు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గూనూరు ఎర్రి నాయుడు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అవయవ దానం

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని వెంకన్నపాలెం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చోడవరం గోవిందమ్మ కాలనీకి చెందిన పద్మజ అని మహిళ తలకు గాయమై విశాఖ కృషి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పద్మజ అవయవాలను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు. పద్మజ భర్త వెంకట్రావు గ్రామీణ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పద్మజ (ఫైల్‌ఫోటో)

జనసేన నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-దేవరాపల్లి : మాడుగుల మండలం శంకరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు చిన్ని రమణ, చిన్ని లక్ష్మణరావు, కడుతుల కొండలరావు బుధవారం ఉపముఖ్యమంత్రి, అనకాపల్లి వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైసిపిలో చేరారు. దేవరాపల్లి మండలం తారువలోని బూడి స్వగ్రామంలో వారికి వైసీపీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. బూడి ముత్యాలనాయుడు సారథ్యంలో నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరం సర్పంచ్ సోలం రమేష్, వార్డు సభ్యులు ఈశ్వరరావు, వైసీపీ నాయకులు చిన్ని అప్పారావు, చిన్ని కొండలరావు పాల్గొన్నారు.

82వ వార్డులో కూటమి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ జివిఎంసి 82వ వార్డు పరిధి విజయరామరాజుపేట, ఆళ్ల వారి వీధి, కోరుబిల్లి వారి వీధి, శ్రీగౌరీ పరమేశ్వరి కోవెల వీధి, శెట్టిబలిజ వారి వీధి తదితర ప్రాంతాల్లో కూటమి నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వంలో వేసిన పన్నుల భారాన్ని, ఆర్థిక ఇబ్బందులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పోలవరపు త్రినాథ్, దాడి జగన్, ఆళ్ల రామచంద్రరావు, కోయిలాడ గణేష్, పేకేట్ రమేష్, పాలిమేర బాబ్జి, పెంటకోట మహేష్, యల్లపు సత్యనారాయణ, ఆళ్ల ప్రసాద్, కాండ్రేగుల వెంకట సూరిబాబు, కొణతాల అప్పలరాజు, రాము యాదవ్, కైచెర్ల సూర్య ప్రకాష్, పెంటకోట శ్రీను పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం శ్రీసత్య సాయి మందిరంలో బుధవారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 11 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్త సేకరణ చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కర్రి ఆది నాగేశ్వరరావు, గ్రామ ప్రతినిధులు ఎం సూర్యనారాయణ, ఎస్ లక్ష్మి జ్యోతిర్మయి, బుద్ద వెంకట సత్యారామ్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ నామినేషన్‌కు తరలివెళ్లిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి- కశింకోట : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి బుధవారం కశింకోట మండలం నుండి వైసిపి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో అనకాపల్లికి తరలివెళ్లారు. బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్ నామినేషన్ కార్యక్రమానికి టిడిపి, బిజెపి, జనసేన నాయకులు వెళ్లారు.

పంచకర్ల నామినేషన్‌కు..

సబ్బవరం : పెందుర్తి అసెంబ్లీ జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి సబ్బవరం మండలంలోని పలు గ్రామాల నుంచి జనసేన, బిజెపి, టిడిపి కార్యకర్తలు పెందుర్తికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు అక్కిరెడ్డి దుర్గినాయుడు, మిడతాడ మహాలక్ష్మినాయుడు, గండి దుర్గాప్రసాద్, లెక్కల అప్పలనాయుడు పడాల వెంకటరమణ పాల్గొన్నారు.

కశింకోట నుండి అనకాపల్లికి బైక్ ర్యాలీగా వెళ్తున్న వైసిపి శ్రేణులు

కొలగార్లు, షావుకారుల తగాదాతో..

బెల్లం మార్కెట్ మూసివేయడం తగదు

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశంలోనే రెండో అతిపెద్ద బెల్లం మార్కెట్ అయిన అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో పది రోజుల నుండి కొలగార్లు, షావుకారులు తగువు పేరు బెల్లం మార్కెట్‌ను మూసివేయడం తగదని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పేర్కొన్నారు. దీని వల్ల బెల్లం రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని, బెల్లం మార్కెట్ కార్యదర్శి యుద్ధ ప్రాతిపదికన మార్కెట్‌ను తిరిగి తెరిపించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న నాలుగు సహకార చక్కెర కర్మాగారాల్లో చోడవరం సుగర్ ఫ్యాక్టరీ మినహా మిగిలిన మూడు ఫ్యాక్టరీలను ప్రభుత్వం మూసివేసిందని తెలిపారు. ఇప్పుడు పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలు బిజెపి, తెలుగుదేశం, జనసేన కూటమి, వైసిపి, కాంగ్రెస్ తదితర పార్టీల అభ్యర్థులు సుగర్ ఫ్యాక్టరీ విషయాల్లో తమ వైఖరిని వెల్లడించాలని కోరారు. తమ పార్టీలు అధికారంలోకి వస్తే సుగర్ ఫ్యాక్టరీలను తిప్పుతారా లేదా తెలియజేయాలని డిమాండ్ చేశారు. అలా తెలియజేయని వారికి వ్యతిరేకంగా రైతాంగం ఓటు వేయాలని అప్పారావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కౌలు రైతు జిల్లా నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

డిజె సౌండ్ సిస్టమ్స్‌పై చర్యలు తీసుకోండి

జిల్లా ఎన్నికల అధికారికి విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికల సందర్భంగా వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి తదితర పార్టీలు డిజె సౌండ్ సిస్టమ్స్ ద్వారా సృష్టిస్తున్న శబ్ద కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్‌కి విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ రాశారు. ఈ లేఖను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు పంపించి వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి ప్రచార రథాలు అనకాపల్లి పురవీధులలో ఆఫీసుల్లోనూ, వ్యాపార సముదాయాలు, కోర్టులు ఇలా అన్ని చోట్ల పని చేసే వారికి, ఆసుపత్రుల్లో రోగులకు తీవ్ర అసౌకర్యాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వివిధ రకాలైన అనారోగ్యాలతో ఉన్నవారు ఈ డిజె శబ్ద కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పార్టీ రాష్ట్రంలోనూ, మరో పార్టీ కేంద్రంలోనూ అధికారంలో ఉండడంతో స్థానిక అధికారులు రాజకీయ ఒత్తిడికి లొంగిపోయి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.

పార్టీలకు విజ్ఞప్తి

రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న పార్టీలు తరఫున ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డిజె సౌండ్ సిస్టమ్స్‌ను రద్దు చేసుకోవాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగానికి తాము ఫిర్యాదు చేసినా, అధికార పార్టీలకు భయపడి వారు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని విమర్శించారు.

రాజీనామా పత్రాలను చూపుతున్న వాలంటీర్లు

34 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి -పరవాడ

మండలంలోని వాడచీపురుపల్లి -1, 2 సచివాలయాల పరిధిలోని పని చేస్తున్న 34 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 57 నెలలుగా తమకు కేటాయించిన ఇళ్లకు సేవా దృక్పథంతో సేవలు అందిస్తున్నామని చెప్పారు. గతంలో ప్రజలకు ప్రభుత్వం నుండి ఏమి పథకాలు వస్తున్నాయో కూడా తెలిసేది కాదు, ఒక వేళ తెలిసినా ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో కూడా తెలిసేది కాదని, అలాంటిది వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఈ సేవలు అన్నీ ప్రజలకు సకాలంలో అందుతున్నాయని తెలిపారు. 57 నెల కాలంలో తమకు సహకారాన్ని అందించిన గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఎమ్మెల్యే అదీప్ రాజ్, అధికారులకు ధన్యావాదాలు తెలిపారు.

రేపు పైలా ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - కె.కోటపాడు

మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం ఈనెల 26వ తేదీన ఏ.కోడూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా పార్టీలో పని చేసినందుకు గుర్తింపుగా మాడుగుల టిడిపి అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించిందని, కొందరి కుట్రల ఫలితంగా టికెట్ చేజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇక్కడ జరుగుతున్న సంఘటనలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పునఃసమీక్షించి తనను అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. ఇందుకు సంబంధించి మాడుగుల నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల కార్యకర్తలతో ప్రజాభీష్టం సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తామని పైలా తెలిపారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - వడ్డాది

బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి.అగ్రహారం, మంగళవారం గ్రామాల్లో వైసిపికి చెందిన వంద మంది కార్యకర్తలు మంగళవారం రాత్రి టిడిపిలో చేరారు. ఎల్‌బిపి.అగ్రహారం వైసీపీ సర్పంచ్ సోదరుడు తమరాన శంకర్ ఆధ్వర్యంలో చేరిన వీరికి చోడవరం టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు, గోకివాడ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ తమరాన దాసు, మాజీ ఎంపిటిసి దొండ శ్రీనివాసరావు, టిడిపి టౌన్ అధ్యక్షుడు సాయం శేషు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులపై శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సంకల్ప ఫల రైతు సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని పెదముసిడివాడలో మైక్రో ఎంటర్ ప్రైజ్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఉత్పత్తులపై 15 రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని నాబార్డ్ జిల్లా అధికారి జి.సుమంత్ కుమార్ బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్ప ఫల రైతు ఉత్పత్తిదారులకు ఈ 15 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని, సరైన శిక్షణ పొందిన వారికి నాబార్డ్ నుంచి సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. జాగ్రతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుజాత మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఇలాంటి శిక్షణ ద్వారా ఉపాధి మార్గాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 30 రకాల ఉత్పత్తులపై శిక్షణ ఇస్తామని, తర్వాత సొంతంగా వ్యాపారం చేసుకునే వారికి బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప ఫల రైతు కంపెనీ ఛైర్మన్ సీతిని అప్పారావు, పెదముషిడివాడ గ్రామ సర్పంచ్ కుమారుడు కబాడీ అప్పారావు, డైరెక్టర్లు పోతుల నూక రత్నం, దుల్ల చల్లారావు, కోరుకొండ దేవుడు, మామిడి వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థ విచ్ఛిన్నం

కేంద్రం చోద్యం చూడటం విడ్డూరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విచ్ఛిన్నం చేశారని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. బుధవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా అనకాపల్లి మండలం మాకవరం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 13,371 పంచాయతీలు, 660 మండల ప్రజా పరిషత్తులు, 13 జిల్లా పరిషత్తులు, 106 మున్సిపాలిటీ, నగర పంచాయతీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయని తెలిపారు. వాటికి చట్టబద్ధంగా ఎన్నికలు జరిగినప్పటికీ నిధులు, విధులు, నియామకాలు లేక ఈ అన్ని వ్యవస్థలు ఉత్సవ విగ్రహాలుగా మారాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లింపు చేసి పంచాయతీ రాజ్ వ్యవస్థను నవ్వుల పాలు చేసిందని తెలిపారు. 13,371 మంది సర్పంచ్‌లు తమ సమస్యలపై ముఖ్యమంత్రికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా కనీసం స్పందించలేదని పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను జగన్మోహన్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తూ కూర్చోవడం విచిత్రంగా ఉందన్నారు. సమావేశంలో మాకవరం సర్పంచ్ మొయ్య నూకరాజు, తుమ్మపాల మాజీ ఎంపిటిసి కనుబుడ్డి నరసింగరావు, పౌర వేదిక ప్రతినిధి కొలసాని రమణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు శ్రీరామ్మూర్తి, తాతారావు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రుత్తల శ్రీరామ్మూర్తి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులతో కలిసి నర్సీపట్నం రిటర్నింగ్ ఆఫీసర్ జయరాంకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న, సిపిఎం నాయకులు అడిగర్ల రాజు, సిపిఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు ఉన్నారు.

నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బోని తాతారావు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు నాయకులు బత్తిన నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు వెలుగుల అర్జున్‌రావు తదితర నాయకులతో కలిసి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం ఆర్ఓ గీతాంజలి కు నామినేషన్ పత్రం దాఖలు చేశారు.

దళిత బహుజన పార్టీ నుంచి వడ్లమూరి కృష్ణ స్వరూప్, ఇండిపెండెంట్ అభ్యర్థి మారుతి నారాయణ చక్రవర్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు ఆర్ఓ గీతాంజలి వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు మారుతి నారాయణ చక్రవర్తి విలేకరులకు తెలిపారు.

బూడి తనయుడు రవికుమార్ నామినేషన్

ప్రజాశక్తి-మాడుగుల: డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు తనయుడు బూడి రవికుమార్ మాడుగుల స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీ.వి.సత్యానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలతో వచ్చే అధికారం కన్నా స్వతంత్ర అభ్యర్థిగా వచ్చే అధికారం గొప్పదని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఆదరణతోనే గెలిచి అభివృద్ధి ఏమిటో చూపిస్తానని తెలిపారు.

మాడుగులలో కూలిన చెట్టు

మాడుగులలో భారీ వర్షం

- నేలకూలిన వృక్షాలు -విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం మూడు గంటల నుండి ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి.నాలుగు గంటల ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో మండలంలోని అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. పలు చోట్ల చెట్లు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

బొట్టా నాగరాజుకు బి.ఫారం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్ : నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం బీఎస్పీ పార్టీ తరపున పోటీ చేస్తున్న బొట్టా నాగరాజు బీ ఫామ్‌ను అందుకున్నారు. ఈ మేరకు బుధవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్, మాజీ డిజీపీ జె.పూర్ణచంద్రరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలో పాలించిన పాలకులు అభివృద్ధి చెందారు తప్పా ప్రజలు చెందలేదన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు పంచాయతీ చెందిన దళిత, యాదవ యువకులు వారా రాజా, తురాల రమేష్ , కిల్లాడ నానాజీ, దినేష్, ప్రసాద్ తదితరులు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి, కౌన్సిలర్ పద్మావతి వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు గంగరాజు, సత్యనారాయణ, మూకల భాస్కర్ మూకల వెంకటరమణ, బర్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని అందజేస్తున్న నిర్వాహకులు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:సత్యసాయి ఆరాధనోత్సవ కార్యక్రమంలో భాగంగా గొలుగొండ మండలం ఏఎల్ పురం బస్ స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. మజ్జిగ, పులిహోరను ప్రయాణికులకు పంపిణీ చేశారు. గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న అర్చకులు

వయో వృద్ధులకు సన్మానం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఆలయ అర్చకులు, గ్రామ పురోహితులు ఆధ్వర్యంలో వెలిది కుటుంబీకుల సౌజన్యంతో వయోవృద్ధులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతీ ఏటా ఈ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని రేబాక గ్రామానికి చెందిన ఎస్.రమేష్, ఎస్.పొట్టియ్య ఇరువురు డెక్కన్ కంపెనీలో విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తున్నారు. గొడిచెర్ల హైవే జంక్షన్ వద్దకు వచ్చే సరికి ప్రమాదవశాత్తు డివైడర్ ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. 108లో గాయపడ్డ యువకులను నక్కపల్లి సిహెచ్‌సికి తరలించారు. పొట్టియ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

-వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు గణేష్, జోగులు

ప్రచారం చేపడుతున్న ఎమ్మెల్యే గణేష్

అనకాపల్లిడెస్క్:అభివృద్ధి, సంక్షేమం కోసం వైసిపిని గెలిపించాలని నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. బుధవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 24వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోకి వెళ్లిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, ప్రజలకు మేలు చేసే మరిన్ని పథకాలు త్వరలోనే ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ మేనిఫెస్టో విడుదల చేస్తారని వెల్లడించారు. ఈ సారి భారీ మెజార్టీ సాధిస్తామని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మీ, వైసీపీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ధనిమిరెడ్డి నాగు పాల్గొన్నారు.

కోటవురట్ల:వైసిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పాయకరావుపేట వైసిపి అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. మండలంలో చిన్న బొడ్డేపల్లి, పాములవాక నీలగుంట గ్రామాలలో మండల వైసిపి అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, దత్తుడు రాజు, సిద్దాబత్తుల సత్తిబాబు, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, ఆవుగడ్డి దుర్గ, వరహాల బాబు పాల్గొన్నారు,

మాట్లాడుతున్న జోగులు

మాట్లాడుతున్న వివేకానందన్

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- సాధారణ పరిశీలకులు కె.వివేకానందన్

ప్రజాశక్తి-పాడేరు:- జిల్లాలో మే 13న జరగనున్న ఎన్నికలు సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సాధారణ పరిశీలకులు కె. వివేకానందన్ సూచించారు. బుధవారం జిల్లాకు చేరుకున్న సాధారణ పరిశీలకులను జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, ఎస్.పి. తుహిన్ సిన్హా, సంయుక్త కలెక్టర్ భావన వసిష్ట్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, డిఆర్ఓ బి. పద్మావతి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించిన దినసరి కార్యక్రమాలను పక్కాగా ప్రణాళిక రూపొందించుకోవాలని, షాడో జోనులపై ప్రత్యేక దృష్టి సారించాల తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణ ప్రణాళికను వివరించారు. ఈ సమావేశంలో రంపచోడవరం నుండి వర్చువల్ విధానంలో రంపచోడవరం రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, డిఆర్ఓ బి.పద్మావతి, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.అంబేద్కర్, వివిఎస్. శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు వెలవెల

ప్రజాశక్తి -కోటవురట్ల: వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా గడిచిన 20 రోజులుగా ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు వెలవెల బోతున్నాయి. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే రెవెన్యూ కార్యాలయానికి ప్రజలు లేక వెలవెలబోతోంది. ప్రధానంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూసర్వే పనులు నిలిపివేయడం, అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా పనులు మంజూరు కాకపోవడం పింఛన్, వగైరా సంక్షేమ పథకాలు అమలకు ఎన్నికల కోడ్ అడ్డంకి కావడంతో పాటు సిబ్బంది కూడా ఎన్నికల విధులలో ఉండటంతో ప్రజలు ఈ కార్యాలయానికి అంతగా రాలేదు. కొన్ని వర్గాల ప్రజలు వివిధ పనులకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఏదో సమయంలో అందుబాటులో ఉంటారో తెలియక కార్యాలయాల చుట్టూ తిరిగి నిరాశతో వెను తిరుగుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న కార్యాలయం

పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలో ఎలక్ట్రోరల్ అధికారి(ఆర్ఓ) కార్యాలయం ఉండడంతో సిబ్బంది వివిధ సందర్భాల్లో ఎక్కువ సమయం అక్కడే ఉంటున్నారు. దీంతో సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో ప్రజలు కూడా ఈ కార్యాలయానికి వచ్చేందుకు అంతగా సుముఖం చూపలేదు. ఇదే పరిస్థితి మిగతా కార్యాలయా వద్ద కూడా కనిపిస్తోంది.త

కాఫీ, సిల్వర్‌ఓక్ తోటలు దగ్ధం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలోని వనబ సింగి పంచాయతీ లింగిపుట్టు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి మూడు ఎకరాల సిల్వర్, కాఫీ, మిరియాల తోటలు దగ్ధం అయ్యాయి.ఇదే తరహాలో గత నెలలో తమ గ్రామంలోనే సిల్వర్, కాఫీ తోటలకు నిప్పంటించారని రైతులు గుర్తు చేశారు. ఐటిడిఏ పిఓ స్పందించి నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని కోరారు. కక్షపూరితంగా అర్ధరాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు తగుల బెట్టారని బాధిత రైతులు ఆరోపించారు.

చిన్నాపురంలో ప్రచారంలో పాల్గొన్న గంటా శ్రీనివాసరావు

పద్మనాభం మండలంలో గంటా ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలోని విజయ ఆనందపురం, చిన్నాపురం, కొయ్యపేట, నేరెళ్లవలస, తునివలస, నర్సాపురం, రెడ్డిపల్లి, పాండ్రంగి, కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల్లో తెలుగుదేశం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలకు తెలుగుదేశం వ్యతిరేకం కాదని, పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టి.రామారావు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పాలన గాడి తప్పిందన్నారు. దాన్ని సరిచేయాలంటే తెలుగుదేశం ప్రభుత్వం రావాలన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి ఈ ఎన్నికలతో ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. చిన్నాపురం గ్రామంలో వైసిపికి చెందిన పది మంది, సింహాచలం ప్రాంతానికి చెందిన 20 మంది గంటా శ్రీనివాసరావు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో చిన్నాపురం సర్పంచ్ శ్రీరామమూర్తి, నాయకులు కె.రమణ, డి.గోపిబాబు, కె.నగేష్‌కుమార్, కె.లీలావతి, బి.పావని తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అపరాధ రుసుం

ప్రజాశక్తి -మధురవాడ : మద్యం తాగి వాహనం నడిపిన వారికి అపరాధ రుసుం విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరావు తెలిపారు. స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలను నడిపిన 16 మందిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2 వేలు నుంచి రూ.4 వేలు వరకు అపరాధ రుసుమును జడ్జి విధించినట్లు ఆయన తెలిపారు.

ఇండియా ఫోరం అభ్యర్థులనే గెలిపించండి

సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -గాజువాక : మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా ఫోరం బలపరచిన అభ్యర్థులనే గెలిపించాలని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు విజ్ఞప్తి చేశారు. గాజువాకలోని ఒక హోటల్‌లో బుధవారం ఇండియా ఫోరం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2024 ఎన్నికల్లో నరేంద్ర మోడీ గెలిస్తే ప్రజాస్వామ్యం ఇబ్బందుల్లో పడుతుందన్నారు. హిందువులను అడ్డు పెట్టుకొని బిజెపి రాజకీయాలను చేస్తోందని తెలిపారు. సంపదను సృష్టించే పరిశ్రమలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. బిజెపి అభ్యర్థులు సిఎం.రమేష్, సుజనా చౌదరి పెద్ద మాఫియా డాన్‌లు అని పేర్కొన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లలో గ్యాస్ ధర రూ.400 నుంచి రూ.1100కు పెరిగిందని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇండియా ఫోరం ఏర్పడిందని, ఫోరం బలపరచిన అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశాఖ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.సత్యారెడ్డి, గాజువాక నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, ఆప్ రాష్ట్ర అధ్యక్షులు సీరం రమేష్, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు, సిపిఎం గాజువాక డివిజన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, జె.రామకృష్ణ, విష్ణుమూర్తి, కె.అచ్యుతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణ, బి.వేణువర్మ, రమణ పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఇండియా ఫోరం నాయకులు

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విద్యుత్ ఛార్జీల పెంపు తగదు

సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో క్వార్టర్లకు విద్యుత్ ఛార్జీలను ఏకపక్షంగా 10 రెట్లు పెంచుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సర్కులర్ జారీ చేయడాన్ని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఉక్కు యాజమాన్యానికి లేఖ రాశారు. ఈ సర్కులర్ పూర్తి నియంతృత్వమని భావిస్తున్నానని, తక్షణం దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడానికి అనేక రకాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, అందులో భాగంగా ఉత్పత్తికి అవసరమైన బొగ్గును కూడా సరఫరా కానివ్వకుండా దుర్మార్గ చర్యలకు పూనుకుందని తెలిపారు. వేతన ఒప్పందం జరిగి చాలాకాలమైనప్పటికీ కార్మికులకు ఇంకా నూతన వేతనాలు అమలు చేయలేదని వివరించారు. తాజాగా ఈ నెల 23వ తేదీన సర్కులర్ విడుదల చేసి ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెంచిన చార్జీలను చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో ఉంటున్న కార్మికులకు, షాపింగ్ కాంప్లెక్స్, విద్యాసంస్థలు, దేవాలయాలకు ఆజ్ఞలు జారీ చేయడం దారుణం అన్నారు. ఇదే అమలు జరిగితే రూ.500 చెల్లించే కార్మికుడు ఇప్పుడు ప్రతినెలా రూ.3000 నుంచి 4000 వరకు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలతో యాజమాన్యం కుదుర్చుకున్న ఒప్పందాలను ఈ సర్కులర్ పూర్తిగా ఉల్లంఘిస్తోందని, ఇది పూర్తిగా ఏకపక్షమైందని, చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, యాజమాన్యం కలిసి చేస్తున్న చర్యలకు కార్మికులను బలి తీసుకోవడం సరైనది కాదన్నారు. తక్షణం ఈ నియంతృత్వ సర్కులర్‌ను వెనక్కి తీసుకోకపోతే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

దిబ్బడి గ్రామంలో నీరు లేక ఎండిపోయిన వరి పంట

ఎండుతున్న వరి నాట్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఖరీఫ్ వరి కోతలు దశలో కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లో నిల్వ ఉన్న నీటిని ఆధారంగా చేసుకొని మండలంలోని పలు గ్రామాల్లో రైతులు రబీ సాగులో భాగంగా వరి నాట్లు వేశారు. మండలంలోని వడ్డాది, చిన్నప్పన్నపాలెం బంగారుమెట్ట, పోలేపల్లి తదితర కస్పా గ్రామాల్లో పెద్దేరు రిజర్వాయర్ నుంచి నీటి ఆధారంగా, దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో చెరువుల్లో నీటి ఆధారంగా వరి నాట్లు వేశారు. అయితే రెండు నెలలుగా కాస్తున్న విపరీతమైన ఎండలకు చెరువుల్లో నీరు పూర్తిగా ఎండిపోయింది. దీంతో పలు గ్రామాల్లో రైతులు వేసిన వరి నాట్లు ఎండిపోతున్నాయి. వర్షపు నీరు ఉంది కదా అని వరి నాట్లు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు పెద్దేరు రిజర్వాయర్ నీరు ఆధారంగా వేసిన వరి పొలాలకు సైతం సరిగా నీరు అందడం లేదు.

ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులివ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి- అచ్యుతాపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనిచేస్తున్న కూలీలకు ఏరోజు ఎంత వేతనం పడుతుందో తెలుసుకునే విధంగా పే స్లిప్పులు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. మండలంలోని కొండకర్ల గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ.300 కూలి ఇస్తున్నామని చెప్పినా ఆచరణలో అమలు కాలేదన్నారు. కాలి బాటన దూరంగా నడిచి వెళ్లి పని చేస్తున్నప్పటికీ గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండవేడి నుండి సేద తీరేందుకు పని ప్రదేశంలో ప్రభుత్వం టెంట్లు వేయాలని, మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలని, 30 శాతం అదనంగా వేసవి అలవెన్స్ ఇచ్చి ఆదుకోవాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి కూలి డబ్బులు చెల్లించాలని, ప్రతి కుటుంబానికీ ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు అప్పల నరసమ్మ, అప్పారావు, సీత, లక్ష్మి, కొండమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జగత శ్రీనివాస్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు తన అనుచరులు, పార్టీ నాయకులతో కలిసి తహశీల్దారు కార్యాలయంలో నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్ని కృష్ణకు నామినేషన్ పత్రాలను శ్రీనివాస్ అందించారు. ఈ

లిబరేషన్ అభ్యర్థి గణేష్...

సిపిఐఎంఎల్ లిబరేషన్ చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చోడవరం ద్వారకా నగర్‌కి చెందిన సవరాల గణేష్ బుధవారం నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి చిన్ని కృష్ణకు అందించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిఎస్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాములవారి విగ్రహ ప్రతిష్టకు విరాళం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని ఎడ్లవానిపాలెం గ్రామంలో రామాలయంలో బుధవారం జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మండల జనసేన నాయకులు ఉగ్గిన త్రినాధ్ హాజరై దేవత మూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీకి రూ.5116 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొంచ మణికంఠ, వల్లం శెట్టి రాము పాల్గొన్నారు.

జిల్లాలో 12,88,921 మంది ఓటర్లు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో 12 లక్షల 88వేల 921 మంది ఓటర్లు వున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. వారిలో 6 లక్షల 27 వేల 101 మంది పురుషులు, 6 లక్షల 61వేల 792 మంది స్త్రీలు, 25 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నామినేషన్ల ఘట్టం ప్రారంభమైందని, 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ వుంటాయని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కే.హరినాధ బాబు (ఆమ్ ఆద్మీ), డి సంతోష్ (కాంగ్రెస్), కలెక్టరేట్ పరిపాలనాధికారి రాజేశ్వరరావు, డిటి రవిబాబు, ఎస్ఎ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న డిఆర్‌ఓ, రాజకీయ పార్టీల ప్రతినిధులు